# తెరవెనుక

## మధురాంతకం రాజారాం

వేసవికాలం. సూర్యుడస్తమించినా ఇంకా చీకటి పడలేదు. దాదాపు అరగంటసేపటినుంచీ మాలతికోసం వేచి చూస్తోంది శోభాదేవి. ఈపాటికే రావలసింది మాలతి. ఒక్కొక్క రోజు గోడ గడియారం పనిచేయడం మానేస్తుంది. ఒక్కొక్కప్పుడు అయిదుగంటల సైరన్ గూడా పళ్లు బిగబట్టి మౌనవ్రతం సాధిస్తుంది. కానీ మాలతి మాత్రం బిడ్డను తీసుకుని షికారుకు రాకుండా నిలిచేది గాదు. ఎందుచేతనో మరి, ఈ రోజింకా ఆమె పొలకువ కానరావడంలేదు.

పరీక్షలు వ్రాసి సెలవుల్లో తండ్రిగారు ఉద్యోగంచేస్తున్న పట్టణానికి వచ్చింది శోభాదేవి. ఆ పట్టణం ఆమెకు క్రొత్త. ఎప్పుడు చూచినా ఇంటిపనుల్లో మునిగితేలుతూ ఉంటుంది తల్లి. తండ్రిగారికి ఆఫీసు కార్యకలాపాలతోనే సరిపోతుంది. అన్నయ్యలందరూ ఉద్యోగరీత్యా మారప్రాంతాల్లో వున్నారు. హాస్టల్లోనే స్నేహితురాళ్ళ మధ్య సందడిగా వుండడానికి అలవాటుపడిన శోభాదేవి, ఆ క్రొత్త పరిసరాల్లో ఒంటి స్తంభపు మేడలో ప్రవాసం గడుపుతున్న చిన్నదానికి మల్లే ఉక్కిరిబిక్కిరౌతోంది.

ఆరోజు ఉదయం పుస్తకాల బీరువాలో శోభాదేవి కొక అపరాధపరిశోధక నవల దొరికింది. అందులోని పుటల వెంట బయల్దేరి, సాయంత్రానికల్లా గమ్యస్థానం చేరుకుని ఆమె హంతకు లెవరో తెలుసుకోగలిగింది. అప్పటికి ఆమె తల దిమ్మెక్కిపోయింది. ముగించిన పుస్తకాన్ని టేబిల్ పైకి విసరి, గబగబా మెట్లెక్కి గదిలో ప్రవేశించి శోభాదేవి కిటికీ తలుపులు తెరిచింది.

కిటికీ కమ్ముల్లోనుంచీ అవతలి వైపుకు చూపు సారించిన క్షణంలో శోభాదేవి వివశురాలైపోయింది. చిత్తరువులోని ఆకృతిలా నాలుగైదు క్షణాలవరకూ ఆమె అలాగే నిల్చుండిపోయింది. ఆ దృశ్యం అలాంటిదే. దిక్కులవరకూ పచ్చని తోటలు, కెంపులు, పచ్చలు, ఇంద్రనీలాలు గుప్పిళ్ళతో తీసి వెదజల్లినట్టున్న పుష్పగుచ్ఛాలు. మెల్లగా కదిలిపోతున్న నీలి మబ్బులు. ఆకాశాన మబ్బుల అంచులకు మెరుగులు దిద్ది క్రిందికి దిగివచ్చి ప్రపంచంపైన వసంతాలు చల్లుతున్న సువర్ణకాంతులు. భువనమోహనంగా ముస్తాబయింది సంధ్యాసుందరి. పచ్చని పావడా కట్టి, పువ్వుల రవిక తొడిగి సరిగంచు వచ్చిన నీలిరంగు వలిపాన్ని పమిటగా వేసుకుని నృత్యానికి సిద్ధమైన రాజనర్తకిలా సంధ్య ఒయ్యారాలు పోతోంది.

కుర్చీ దగ్గరికి లాక్కుని అందులో కూర్చుంది శోభాదేవి. మనిషిలో చలనం లేకున్నా మనసులో మాత్రం ఆలోచనలు కదిలిపోతున్నాయి. మాలతి ఎప్పుడో రావలసింది! మాలతి వస్తే కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకోవచ్చు. పెద్ద మేడ. చుట్టూరా తోట. ప్రశాంత గంభీరమైన ప్రకృతి. బీరువాలో పుస్తకాలు. ఇవన్నీ తనకొక పలుకు తోడులేని కొరతను తీర్చలేకపోతున్నాయి. ఒకవేళ మాలతి యింటికి బంధువులు వచ్చారేమో? ఊళ్ళోకి ఏదైనా క్రొత్త సినిమా వచ్చి, ఇంటిల్లిపాదీ దానికి వెళ్లారేమో? లేకుంటే ఆమెకుగానీ, పాపకుగానీ ఒంట్లో సుస్తీగా వుందేమో! కారణం ఏదైతేనేమి, ఈరోజు మాలతి వాహ్యాళికి రాదలచుకోలేదల్లే వుంది.

పదిహేను రోజులకు ముందు మాలతి ఎవరో శోభాదేవికి తెలియదు. ఆనాటి సాయంకాలం ఆమె సరిగ్గా యిలాగే మేడపైన కిటికీదగ్గర నిల్చుని అస్తమిస్తున్న సూర్యుడివైపు చూస్తోంది. చూస్తుండగా హఠాత్తుగా ప్రత్యక్షమైంది మాలతి. ఆమె పాపను తీసుకుని, దట్టంగా బలిసిపోయివున్న కలబంద మొక్కల కంచెకు అవతలివైపున మట్టిబాటవెంట మెల్లగా నడిచి వస్తోంది.

ఆరోజే గాదు, ప్రతిరోజూ మాలతి మల్లెపువ్వులాంటి తెల్లటిచీర కట్టుకుంటుంది. పొందికగా అమరిఉన్న జాకెట్టు తొడుక్కుంటుంది. మెడకూ చేతులకూ ఆభరణాలుంటాయి. జడలో పువ్వులు తప్పనిసరి! మంచులో తడిసిన తరువాత నీరెండలో నిగనిగలాడుతున్న గులాబీ పువ్వులా వుంటుంది మాలతి. చూడగానే ఆమెతో తనకు పరిచయం కలిగితే బాగుండుననుకుంది శోభాదేవి. కానీ తాను మేడపైన గదిలో వుంది. ఆవిడ తోటకవతల బాటవెంబడి నడుస్తోంది. ఆమెకూ, తనకూ పరిచయం ఎలా సాధ్యమవుతుంది?

ఆ మరునాటి సాయంకాలం గూడా సరిగ్గా అదే సమయానికి, అదే రోడ్డుపైన నడుస్తూ మాలతి ప్రత్యక్షమైంది. ఆ తరువాత ఏడెనిమిది రోజులవరకూ అలాగే ప్రత్యక్షమవుతూ వచ్చింది. ఊరుకోలేకపోయింది శోభాదేవి. మేడ దిగి, తోటచివరికి వెళ్ళి ఆమె మాలతి చూపుకు ఆనేట్టుగా నిల్చుంది. కానీ గాలిపాటున కదిలివచ్చి మున్ముందుకు తేలిపోతున్న సుగంధంలా మాలతి శోభాదేవిని చూచి గూడా చూడనట్టే వెళ్ళిపోయింది.

అయితే యింతమాత్రానికే నిరుత్సాహ పడిపోలేదు శోభాదేవి. మరునాటి సాయంకాలం ఆమె దండిగా పూచిన పూలరెమ్మ నొకదాన్ని విలాసంగా గాలిలో వూపుకుంటూ తోటలో పచార్లు చేస్తోంది. ఆమెచేతిలోని పూలరెమ్మ కనబడగానే పాప "పూలే అమ్మా,

పూలు. తోతివ్వవూ....” అంటూ మారాంచేసింది. శోభాదేవి ఆ అవకాశాన్ని చక్కగా వినియోగం చేసుకుంది. ఆమె తల్లితో తనకేమీ సంబంధం లేనట్టు బిడ్డకేసి చూస్తూ “దిగి నా దగ్గరి కొస్తే యిస్తాను....” అంది.

“అబ్బే, దానికి తగని సిగ్గండీ! ఎవరి దగ్గరికీ వెళ్ళదు” అంది కూతురి తరపున వకాల్తా పుచ్చుకుంటూ మాలతి.

“అలాగైతే నేనే పాపదగ్గరికొస్తాను, నన్నూ మీతోబాటు షికారుకు రానిస్తామంటే,” అంది చిరునవ్వుతో శోభాదేవి.

“దానికేం భాగ్యమండీ! నిక్షేపంగా రావచ్చు. చూచావా చిట్టీ! పిన్ని గూడా మనతోబాటు షికారుకొస్తుందట.” అంది మాలతి.

“పోనీ, ప్రతిరోజూ వెళ్తున్న షికారే గదండీ! కాసేపా బెంచీపైన కూర్చుని మాట్లాడుకోవచ్చు. మీరే మా తోటలోకి రాగూడదూ?” అంటూ సమయం చూచుకుని స్వాగతం పలికింది శోభాదేవి.

వాళ్ళ పరిచయం ఆ విధంగా ప్రారంభమైంది.

“ఏమిటోనండీ! ఈ ఊళ్ళో పొద్దే పోవటంలేదు. జీవితమే స్తంభించిపోయినట్టుంది. అన్నట్టు మీదీ వూరేనటండీ?” అని బెంచీపైన కూర్చున్న తర్వాత ప్రశ్నించింది శోభాదేవి.

“అబ్బే, మాదీవూరెందు కవుతుంది? పుట్టిల్లు అనంతపురం. మీరు వినే వుంటారు. ఆదిశేషయ్యగారని, పెద్ద లీడింగు లాయరు. ఆయన మా పెదనాన్నగారే. పోతే, మా నాన్నగారేమో పసుపు వ్యాపారం చేస్తుంటారు. శ్రీలక్ష్మి పసుపు గిడ్డంగి అంటే నాలుగు జిల్లాలకు ప్రసిద్ధి. లారీ లెప్పుడూ మదరాసు, బెంగుళూరు, హైదరాబాదుల మధ్య పరుగెడుతుంటాయి. మీ రెప్పుడైనా అనంతపురం చూశారటండీ? చాలా పెద్ద వూరు....”



“ఐతే మీ రీ వూళ్ళో ఎంతకాలం నుంచీ వున్నారండీ?” మాలతి వాగ్ధోరణికి అడ్డుతగిలి శోభాదేవి మళ్ళీ ప్రశ్నించింది.

“ఇది మూడో యేడు. ఇక్కడి కొచ్చిన కొత్తలో మా చిట్టి పుట్టింది. ఇప్పుడు దీనికి రెండేళ్ళు” అంది మాలతి.

“పువ్వు లిచ్చేశానుగా చిట్టీ! ఇప్పుడు నన్ను నువ్వెత్తుకోనివ్వాలి....” అంటూ శోభాదేవి చిట్టిని దగ్గరికి తీసుకుంది. దగ్గరికి తీసుకోవడమే తడవుగా చిట్టి శోభాదేవి ఒడిలో కూర్చోడానికి సంసిద్ధత ప్రకటించింది.

“అదేమిటండీ? మీ పాపకు తగని సిగ్గన్నారు కదూ! పిలవగానే వచ్చేసిందే మరి!” అంటూ యించుక విస్మయాన్ని వ్యక్తపరిచింది శోభాదేవి.


ఈ సందేహానికి సమాధానంగా పక్కున నవ్వి, “ఒకవేళ మీరు దానికి స్వంతమనిషిలా కనిపిస్తున్నారేమో!” అంది మాలతి.

“అవునా చిట్టీ!” అని పాప కళ్ళల్లోకి చూస్తూ “పోనీ, స్వంత మనిషి నేననుకో. బంగారు బుజ్జివి గదూ; నీ కో ముద్దిస్తాగానీ, నా కీ గొలుసు కాస్తా యిస్తావా చిట్టీ?” అంది శోభాదేవి.

కళ్ళు పెద్దవిచేసి తల అడ్డంగా తిప్పుతూ ‘అమ్మో, ఎంత దురాశ, అన్నట్టు పాపాయి కిలకిలా నవ్వింది.

“ఎక్కడ బావ అన్నా వంగతోట దగ్గర అనకూడదన్నమాట!” అంది తను గూడా నవ్వుతూ శోభాదేవి.

“గొలుసంటే జ్ఞాపకం వచ్చింది. ఆ పతకాన్ని చూశారటండీ! నేను ప్రత్యేకంగా పురమాయించి చేయించాను. కంసాలి తికమకపడిపోయి ‘మాదిరి’ లేందే యిలాంటి పతకం చేయడం తన వల్ల కాదుపొమ్మన్నాడు కూడా! ఆ



పాటున నేను మా అక్కయ్యకు జాబు వ్రాసి నగను రిజిష్టర్డు పార్సెల్లో తెప్పించాను. ఆ తరువాత చాలామంది ఇలాంటి పతకాలే చేయించుకున్నారు." నెల్లూరులో వున్న ఆ అక్కగారిని గురించి చెప్పుకుపోతోంది. ఆవిడ భర్తగారు లారీ ఓనరట. ఆయన మోటారు కారుపైన తప్పితే నేలపైన నడవట! రామమూర్తి నగర్‌లో ఆయన కట్టించిన మేడ ఈ ధరల్లో ఎంత లేదన్నా పాతికవేలు చేస్తుందట! తన బంధువుల యిళ్ళను గురించి చెపుతున్నప్పుడు నిజంగా ఉత్తేజితురాలైపోయింది మాలతి. అనంతపురం బుక్కరాయల వీధిలో వాళ్ళ మేడపై నిల్చుని చూస్తే పట్టణమంతా ఫోటో పట్టినట్టు కనిపిస్తుందట! "మీ రెప్పుడైనా అనంతపురం వస్తే తప్పకుండా మా యింటికి రావాలి సుమండీ! మిద్దెపైన పెద్ద హాలుంది. పైన్నే స్నానాలగది గూడా వుంది. మీరు కిందికి దిగాల్సిన పనే వుండదు," అంది మాలతి.

శోభాదేవి నిర్ఘాంతపోయింది. చిన్న చిన్న కారణాల సంగతలా వుండగా ఆమె అలా నిర్ఘాంతపోవడానికి ముఖ్యమైనకారణాలు రెండు. దాదాపు అరగంట నుంచీ మాట్లాడ్తోంది మాలతి. ఆ ప్రసంగంలో ఎంతసేపైనా తన గొడవే గానీ. ఎదుటిమనిషిని గురించిన ప్రసక్తే లేదు. ఇంతకన్నా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, ఆమె సందర్భం కల్పించుకుని తన పుట్టింటివారి సిరిసంపదల్ని గురించి, అక్కగారిని గురించి ఒకటికి రెండుసార్లుగా ప్రస్తావించింది. ఈగ ఇల్లలుకుతూ తన పేరు మరచిపోయినట్టు ఈ వూర్లో తన కాపురాన్ని గురించిన వివరాలు మాత్రం చూచాయగానైనా బైటపెట్టలేకపోయింది.

మొదట మొదట మాలతి మనస్తత్వం కాస్త విడ్డూరంగానే కనిపించినప్పటికీ, ఆమెతో సర్దుకోదలచింది శోభాదేవి. మంచి స్నేహితురాలవునో కాదో గానీ మాలతి మంచి మాటకారి అన్నమాట మాత్రం అక్షరాలా నిజం! తనకు కావలసింది కాలక్షేపం. ఇంతకన్నా వినోదకరమైన కాలక్షేపం ఎక్కడ దొరుకుతుంది?

స్నేహంగా పరిణమించడానికి మునుపు పరిచయం కొన్ని ప్రాథమిక దశల్ని అధిగమించవలసి వుంటుంది. అందుకు కొంతకాలం పడుతుంది. మాటలు, మన్ననలు, మమకారాలు యివన్నీ మైత్రికి సోపానాలు. ఈ సోపానాల్ని అధిరోహించే చొరవ ఒకరిలో వున్నంతగా మరొకరిలో లేనప్పుడు స్నేహలత పెరిగి పెద్దది కావడంలో ఆలస్యం జరుగుతుంది.

నాలుగురోజుల పరిచయం తర్వాత గానీ శోభాదేవి మాలతిని కాఫీకి ఆహ్వానించలేకపోయింది.

తీరా ఆహ్వానించాక "ఇప్పుడేం కాఫీ లెండి శోభాదేవిగారూ! బాగా చీకటి పడిపోయింది. రేపు తప్పకుండా వస్తాను" అంటూ సెలవుతీసుకుంది మాలతి.

ఆ రేపేమో రానే వచ్చింది. కానీ మాలతి జాడ మాత్రం కానరావడంలేదు.

చిరాకుతో లేచి నిల్చుంది శోభాదేవి. తటాలున కిటికీ తలుపులు మూసి క్రిందికి దిగి వెళ్ళిపోవాలని కూడా అనుకుంది. కానీ అంతలో రోడ్డుపైన నడిచి వస్తున్న మానవాకారం ఒకటి కనిపించింది శోభాదేవికి. మాసిన దుస్తులు. చెదరిన క్రాపింగు, పెరిగిన గడ్డం ఒక్కమాటలో చెప్పాలంటే అదేమంత చూడదగిన ఆకారం గాదు. కానీ చూడకుండా వుండలేకపోయింది శోభాదేవి. అందుకు కారణం — ఆ కనిపించిన మనిషి ఒంటరిగా లేడు. అతడు తన వెంట మాలతి కూతురు చిట్టిని గూడా తీసుకొస్తున్నాడు.

శోభాదేవిలో ఓ భయవీచిక విసురుగా పారాడింది. చిన్ననాటి సంఘటన ఇప్పటికీ అమ్మ అప్పుడప్పుడూ చెబుతుంటుంది — తన కప్పుడు రెండేళ్ళట. వసారాలో ఆడుకుంటూ వుండగా ఎవడో దొంగ తనను అమాంతంగా ఎత్తుకెళ్ళి నగలన్నీ ఒలుచుకుని పార్కులో దిగవిడిచి వెళ్ళిపోయాడట! ఇంకా నయం. ప్రాణాలకు ముప్పు తప్పింది.

ఆలోచనల్లో కొట్టుమిట్టాడిపోతున్న శోభాదేవి అంతకంతకు దగ్గరవుతున్న అడుగుల సవ్వడి సైతం గమనించలేకపోయింది. "ఏమిటమ్మా శోభా! పిచ్చాణ్ణి పరిశీలనగా చూస్తున్నట్టున్నావే ...." అంటూ పలకరించారు నాన్నగారు.

"పిచ్చాడా నాన్నా! నిజంగా?" విస్తుపోయింది శోభాదేవి.

"ఒక్కొక్కప్పుడలా అనిపిస్తుంది. మా ఆఫీసులోనే పనిచేస్తున్నాడులే! ఇంకా యు డి.సి గా ప్రమోషను రాలేదు. మనిషి మంచివాడే. కానీ రాక్షసుడి ఆకలి ఎలాంటిదో డబ్బంటే అతడికున్న వ్యామోహం అలాంటిది ఉద్యోగం చేస్తున్నాడు కదా! ఇది చాలక ఎక్కడో కొట్టులో లెక్క రాస్తున్నాడు. ఇదివరకు ఓ సినిమా థియేటర్లో టికెట్లు గూడా ఇచ్చేవాడు. ఇప్పుడిస్తున్నాడో, లేదో తెలియదు. ఇంత సంపాదిస్తున్నాడుగదా, ఆ మనిషి సుఖంగా, శాంతిగా కనిపించడు. ఎప్పుడూ ఏదో దారపోసుకున్నవాడిలా దిగులుముఖంతో దేబిరిస్తుంటాడు. మొత్తానికి చిత్రమైన మనిషి ...." పెదవి విరిచి తల పంకిస్తూ అన్నారు నాన్నగారు.

విస్మయాతిరేకంతో కాసేపు భ్రమాన్పడి వుండిపోయింది శోభాదేవి. ఉన్నదానికీ, కోరుతున్నదానికీ మధ్య నలిగిపోతున్న ఆ మానవుడు తెరలు తెరలుగా లోకాన్ని ఆవరించుకుంటున్న చీకటిలోపడి అదృశ్యుడైపోయినతర్వాత కిటికీతలుపులు మూసేస్తూ అతడికోసం ఒకసారివేడిగానిట్టూర్చిందిశోభాదేవి. ●